క్లుప్తంగా

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ సభను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దామోదర్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి గ్రామాల వారీగా సామాజిక తనిఖీ నివేదికను వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొననున్నారని తెలిపారు.

ఘనంగా రథోత్సవం



చండూర్‌లో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపును ప్రారంభించారు. అంతకుముందు మాధవానంద సరస్వతి, శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



టేక్మాల్ మోడల్ స్కూల్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలాభివృద్ధి జరుగుతుందని పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. శుక్రవారం టేక్మాల్ మోడల్ స్కూల్‌లో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులను రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండో విడతగా మండలానికి రూ. 1.20కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 13 గ్రామాలకు రూ.5 లక్షల చొప్పున సీసీరోడ్డు పనులు, బొడ్మట్‌పల్లి ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ. 25లక్షలు, దనూర హైస్కూల్‌కు రూ.15 లక్షలు, టేక్మాల్ పీడబ్ల్యూ రోడ్ నుంచి మోడల్ స్కూల్ వరకు రూ.15 లక్షల సిసి రోడ్డు, టేక్మాల్ ఎస్సీ హాస్టల్ ప్రహరీకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మంత్రి ఆదేశాలతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిలు, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు కిషోర్, మాజీ కోఆప్షన్ షేక్ మజహర్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సాగర్, నాయకులు శివ మల్లయ్య, దండుకాంతం, అనిల్, సాయి శేషుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ



వృథాగా పారుతున్న భగీరథ నీరు

నర్సాపూర్: పట్టణంలోని చౌరస్తా మీద మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు లీకేజీతో నీరంతా వృథాగా పోతోంది. నీరు రోడ్డుపై నుంచి పారడంతో రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైను లీకేజీకి వెంటనే మరమత్తులు చేయించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశామని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతీరోజు కనీసం 50 మంది కూలీలు సైతం కూడా పనిచేయడం లేదని, పలు గ్రామాల్లో 8 నుంచి 10 మంది కూలీలు మాత్రమే పనులకు హాజరు అవుతున్నారని, అయినప్పటికీ కూలీ హాజరును పట్టించుకోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు శంకరయ్య, అజ్జమర్రి గ్రామం, సత్తయ్య, చండూర్, రవీందర్ ఫైజాబాద్, యాదగిరి అంతారం, పంచాయతీ కార్యదర్శులు అశోక్, గంగారం, కీర్తి, జగ్గంపేట, సంజీవ్, రాందాస్‌గూడలకు మెమోలు జారీ చేశామన్నారు. మరో రెండు రోజుల్లో ఎలాంటి పురోగతి లేకపోతే, జిల్లా అధికారుల దృష్టి తీసుకెళ్తామన్నారు.

ఘనంగా 'స్వయం' పాలన



రామాయంపేటలోని బాలికల పాఠశాలలో టీచర్లతో విద్యార్థినులు



అల్లాదుర్గం(మెదక్): బాలికల పాఠశాలలో..



పాపన్నపేట(మెదక్): యూసుఫ్‌పేటలో..

రామాయంపేట(మెదక్): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులు స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారి, వారి జూనియర్లకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గంలోని బాలికల పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. పాఠశాల హెచ్‌ఎంగా లావణ్య, ఉపాధ్యాయులుగా శ్రావ్య, మాధవి, అశ్విని, స్వాతి, కౌసల్య ఒక రోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

యూసుఫ్‌పేటలో..

పాపన్నపేట(మెదక్): యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌గా శ్రీజ,ఆర్డీడిగా అక్షిత్, జాయింట్ కలెక్టర్‌గా సాత్విక్, డీఈఓగా శ్రీవర్ష, ఎంఈఓగా అర్చన, హెడ్మాస్టర్‌లుగా అఖిల, శివశంకర్, టీచర్లుగా శ్రీతేజ, స్వాతి, హరిచందన, రిజ్వాన్, వరుణ్, వ్యవహరించారు.

సాంకేతికతను పెంపొందించుకోవాలి

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ దయాగ్రామ్స్, పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులు అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ... విద్యార్థులు సాంకేతికతను పెంపొదించుకోవాలని, సైన్స్‌పై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. సైన్స్ మానవుల జీవితాలను మరింత మెరుగ్గా, సులభంగా చేసిందన్నారు.



పాపన్నపేట(మెదక్): విద్యార్థులకు సైన్స్ పరికరాల గురించి వివరిస్తున్న విద్యార్థులు



కొల్చారం(నర్సాపూర్): రంగంపేట పాఠశాలలో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): సోమక్కపేట్ పాఠశాలలో..



పెద్దశంకరంపేటలో..



చేగుంట ఉన్నత పాఠశాలలో ..



నిజాంపేట(మెదక్): రాంపూర్‌లో..



టేక్మాల్ కేజీబీవీలో..

శ్రీనివాస్ సేవలు శ్లాఘనీయం

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ గడపాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సుదీర్ఘకాలం సేవలు అందించిన నర్సాపూర్ ఎస్‌ఐ శ్రీనివాస్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నర్సాపూర్ ఎస్‌ఐ శ్రీనివాస్ దంపతులను ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థకు చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, వాళ్య నాయక్, కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పౌరహక్కులు తెలుసుకోవడం వల్ల ప్రజాసమస్యలు దూరం అవడంతో పాటు, ప్రజల ఐక్యతతో గ్రామాభివృద్ధి సాధ్యమని ఎస్‌ఐ నర్సింలు, ఆర్‌ఐ సునీల్‌సింగ్ అన్నారు. శుక్రవారం వారు మండలంలోని సోమక్కపేట్ గ్రామంలో పౌరహక్కుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌర హక్కుల్లో ఎలాంటి వివక్షలు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రతీ నెల కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా అంటరానితనం, ఆలయాల ప్రవేశం, పౌర సరాఫరాలు, పెన్షన్లు తదితర వివరాల గురించి వారు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామస్తుల్లో అర్హులైన వారికి రేషన్ సరుకులు, పింఛన్లు సమయానికి వస్తున్నాయా అని అధికారులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నగరం గ్రామంలో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నగరం గ్రామంలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ ఇమ్మాద్ మాట్లాడుతూ.. గ్రామంలో మూఢనమ్మకాలను నమ్మకూడదన్నారు. రెండు గ్లాసుల పద్ధతి, అంటరానితనం, జోగిని వ్యవస్థపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హరీఫ్ హుస్సేన్, పోలీస్ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ప్రతీ ఒక్కరూ గౌరవించాలి

పెద్దశంకరంపేట(మెదక్): చట్టాలను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. శనివారం అంబేడ్కర్ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. రహదారి భద్రత, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. సమాజంలో ప్రజలందరూ సమానమేనని, ప్రజలను కులాల పేరుతో దూషించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమేశ్ తదితరులున్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో అందరు కలిసి మెలిసి ఉండాలని ఆర్‌ఐ కిషన్, హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాయిపల్లిలోని ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అందరం కలిసి మెలిసి ఉంటున్నామని కులవివక్ష లాంటి సంఘటనలు లేవని చెప్పారు.



నిజాంపేట(మెదక్): సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐ ఇమ్మాద్



చిలప్‌చెడ్(నర్సాపూర్): సోమక్కపేట్ పౌరహక్కుల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కుల వివక్షకు తావు ఇవ్వరాదు

చిన్నశంకరంపేట(మెదక్): భారత రాజ్యాంగం ప్రకారం అందరు సమానమేనని ఎలాంటి కుల వివక్షకు తావి ఇవ్వరాదని ఎస్‌ఐ నారాయణగౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని చందంపేట గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కూడా ఇందుకు కట్టుబడి ఉండాలని, ఎలాంటి వివక్ష కన్పించినా.. తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజు, గ్రామ కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా పూర్తి చేయండి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ నిర్మిస్తున్న శ్రీ గురుపీఠంలోని ఆలయాలను మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయాలని పీఠం వ్యవస్థాపకుడు శివకుమార్‌గౌడ్, బగలాముఖీ శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ అన్నారు. శుక్రవారం శ్రీ గురుపీఠం నిర్మాణ పనులు పరిశీలించి ఆలయాలు నిర్మిస్తున్న శిల్పి బాలసుబ్రమణ్యంతో చర్చించారు. దత్తాత్రేయ, సాయిబాబా ఆలయాల నిర్మాణపనులు త్వరగా పూర్తిచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు సంతోష్ శర్మ, శ్రీ గురుపీఠం సభ్యులు సూర్యకుమార్‌గౌడ్, శ్రీనివాస‌గౌడ్, లిల్లీ, చిన్న, సత్యనారాయణ, అర్జున్ తదితరులు ఉన్నారు.



ఆలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న శివకుమార్‌గౌడ్,శాస్త్రుల వెంకటేశ్వరశర్మ

చదువుకొని సన్మార్గంలో నడవాలి

రామాయంపేట(మెదక్): విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో మంచిగా చదువుకొని సన్మార్గంలో నడుచుకోవాలని సీఐ వెంకట్ రాజాగౌడ్ సూచించారు. శుక్రవారం స్థానిక స్నేహ కళాశాలల విద్యార్థులు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇంటర్ దశ ఎంతో కీలకమని, ఈదశలోనే వారి భవిష్యత్ రూపు దిద్దుకుంటుందన్నారు. నేడు చాలా మంది విద్యార్థులు చెడు మార్గంవైపు మళ్లుతున్నారని, వారి భవిష్యత్‌కు ఇది ఆటంకంగా మారుతుందని హెచ్చరించారు. విద్యార్థులకు పట్టుదల చాలా ముఖ్యమని, స్నేహ కళాశాలల కరస్పాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ,, తమ కళాశాలల్లో చదివిన విద్యా ర్థులు నేడు ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. అంతకుముందు విద్యార్థులు నృత్యం చేశారు. విశ్రాంత ఉద్యోగులు రాంరెడ్డి, రాములు, ప్రముఖ వ్యాపారస్తుడు దయాకర్, లెక్చరర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ వెంకట్ రాజాగౌడ్

ఉత్సవాలకు ముస్తాబైన గురుపాదగుట్ట

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం పెద్దశంకరంపేటకు దగ్గరలో ఉన్న గురుపాదగుట్ట క్షేత్రం ఉత్సవాలకు ముస్తాబవుతోంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం రుద్రాభిషేకాలు, ఆకు పూజ, పుణ్యాహవచనం, భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, అన్నపూజ, ఉదయం 10 గంటలకు రుద్రయాగం, ఆదివారం ఉదయం 11 గంటల 45 నిమిషాలకు పార్వతిపరమేశ్వరుల కల్యాణం, బండ్ల ఊరేగింపు, నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పేద విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ప్రారంభం

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులు బాగా చదివి జీవితంలో రాణించాలని విశ్వ మానవ సంఘం ఫౌండర్ మస్తాన్‌రావు అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీరోజు మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ట్యూషన్ నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ట్యూషన్ చెప్తామన్నారు. కార్యక్రమంలో విశ్వ మానవ సంక్షేమ సంఘం సభ్యులు సోమయ్య, కేవలం కిషన్ విజ్ఞాన కేంద్రం ఉపాధ్యాయురాలు రేణుక, నిర్వాహకులు మల్లేశం, సత్యం, సంతోష్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా అమలు చేయాలి

నర్సాపూర్: పంట నష్టం జరిగినప్పుడు రైతులకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందించేలా పంటల బీమా పథకం అమలు చేయాలని రైతు రక్షణ సమితి ప్రతినిధులు డీఏఓ సహదేవ్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. శుక్రవారం తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్య ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో డీఏఓ సహదేవ్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పంట బీమా అమలు చేయాలని కోరారు. పంట బీమా అవసరాన్ని అందులో వివరించారు. ఆయన వెంట సమితి ప్రతినిధులు నర్సారెడ్డి, చంద్రశేఖర్, వెంకటేష్, రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి



కర్నాల్‌పల్లి సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గ్రామస్తుల నిరసన

చేగుంట(తూప్రాన్): గ్రామంలో ప్రతీరోజు ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామస్తులు శుక్రవారం సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల రోజులుగా ప్రతీ రోజు ఉదయం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. గ్రామానికి విద్యుత్ అందించే మినీ ట్రాన్స్‌ఫార్మర్ లోపంతో ప్రతిరోజు విద్యుత్ అంతరాయం కల్గుతుందని తెలిపారు. గ్రామస్తుల నిరసనతో స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ భరత్ స్పందించారు. గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా అందించేందుకు శనివారం చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

సంక్షిప్త వార్తలు

◆ **కొనసాగుతున్న రిలే దీక్షలు**

నర్సాపూర్: డంప్‌యార్డు వద్దంటూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో డంప్‌యార్డు ఎత్తి వేయాలన్న డిమాండ్‌తో నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 10వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

◆ **దర్జీలకు సన్మానం**



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని దర్జీలకు శుక్రవారం వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి సన్మానించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ.. టైలర్స్ డేను పురస్కరించుకొని వారిని సన్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్జీ సంఘం నాయకులు శ్రీనివాస్, సాయిబాబా, బోగరాజు, వేణు, ముత్యం, తరుణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

◆ **బగలాముఖీ ఆలయంలో హోమం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయానికి మాఘఅమావాస్య సందర్భంగా శుక్రవారం భక్తజనం పోటెత్తారు. బగలాముఖీ ఉపాసకులు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, హరిద్వార్చన, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, అర్చకులు సంతోష్‌శర్మ, కమలేశ్, నిర్వాహకులు సూర్యంగౌడ్, లక్ష్మీనర్సయ్య, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

◆ **సోమేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని సోమేశ్వర బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం పోచమ్మకు గ్రామస్తులు బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసి, బోనాలను అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, కిష్టయ్య, జీవన్ పాల్గొన్నారు.

◆ **భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ జాతర**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్‌నగర్‌లో భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ జాతర కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం భక్తులు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. డప్పువాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో ఆలయం చుట్టూ పాచిబండ్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, రఘు, బాలాగౌడ్, రవియాదవ్, కృష్ణ, గ్రామస్తులు, తండా వాసులు భక్తులు పాల్గొన్నారు.

◆ **నాగ్సాన్‌పల్లిలో ఉచిత వైద్యశిబిరం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లిలో శుక్రవారం హైదరాబాద్ మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆస్పత్రి డాక్టర్లు సాయికిరణ్, సుదర్శన్ ఆధ్వర్యంలో 120మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లం, ఉపసర్పంచ్ నరహరి, ఆస్పత్రి పీఆర్‌ఓ హరికృష్ణ, నాగప్ప, సిబ్బంది ప్రశాంతి, ఇశ్రత్, శ్రావణి, శ్రీశైలం, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **మీ సేవ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీ**

నర్సాపూర్: పట్టణంలోని పలు మీ సేవా కేంద్రాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన చార్జీల కన్న అధికంగా వసూలు చేయడంతో పాటు ఆయా శాఖల అధికారుల పేరు మీద డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేశారు. పలువురు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా తమ మీ సేవ కేంద్రాలను ఇతర వ్యక్తులకు లీజ్‌కు ఇచ్చారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది.

◆ **ఇన్‌చార్జి ఎంపీడీఓగా కృష్ణమూర్తి**

మనోహరబాద్(తూప్రాన్): మనోహరబాద్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. మనోహరబాద్ ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేయడంతో ఉన్నతాధికారులు సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో బాధ్యతలను స్వీకరించారు.

◆ **ఆలయంలో ప్రత్యేక పూజలు**

నర్సాపూర్: అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం ఆలయ అర్చకుడు హరిప్రసాద్‌శర్మ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.